

చీనీ టన్ను రూ.22 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.22 వేలు పలికాయి.



టమాట కిలో రూ.22

అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.22 పలికింది. కనిష్టం రూ.7, సరాసరి రూ.13 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.1°/23.4°

జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత అధికంగా ఉంది. సాయంత్రం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా వర్షాలు కురిశాయి.

న్యూస్‌రీల్

తేనెటీగల దాడిలో 10 మందికి గాయాలు



తేనెటీగల దాడిలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కత్రిమల గ్రామస్తులు

ఉరవకొండ: తేనెటీగల దాడిలో 10 మందికి గాయాలైన ఘటన వజ్రకరూరు మండల పరిధిలోని పందికుంట గ్రామం వద్ద చోటు చేసుకుంది. వివరాలు.. బుధవారం కత్రిమల, ఎద్దులపల్లి గ్రామాలకు చెందిన వారు ఆటోలో పందికుంట మీదుగా ఉరవకొండకు బయలు దేరారు. పందికుంట వద్ద పొలంలో కొంత మంది పిల్లలు తేనె పట్టు వద్ద పొగ పెట్టడంతో ఈగలు ఒక్కసారిగా పైకి లేచాయి. ఆటోలో వెళ్తున్న వారిపై దాడి చేశాయి. స్థానికులు వారిని ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

పీహెచ్‌డీకి దరఖాస్తుల ఆహ్వానం


అనంతపురం సెంట్రల్: జేఎన్‌టీయూ(ఏ)లో ఇండస్ట్రియల్ కోటా కింద పార్ట్‌టైం, ఫుల్‌టైం పీహెచ్‌డీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అడ్మిషన్స్ డైరెక్టర్ ఆచార్య కిరణ్మయి ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర సంస్థల్లో పనిచేసే వారు, ఆర్అండ్‌డీ సంస్థల్లో పనిచేసే సైంటిస్టులు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ వంటి పదవుల్లో ఉండే ప్రజాసేవకులు అర్హులని పేర్కొన్నారు. మాస్టర్ డిగ్రీలో కనీసం 55 శాతం మార్కులు లేదా 6.0 సీజీపీఏ సాధించి ఉండాలని తెలిపారు. సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్స్, కంప్యూటర్ సైన్స్, కెమికల్ ఇంజినీరింగ్, భౌతికశాస్త్రం, రసాయనిక శాస్త్రం, గణితం, మేనేజ్‌మెంట్, ఫార్మా, ఆంగ్లం, ఫుడ్ టెక్నాలజీ విభాగాల్లో పీహెచ్‌డీ చేయడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు. వర్సిటీ అనుబంధ కళాశాలలే కాకుండా గుర్తించిన 12 రీసెర్చ్ సెంటర్లలోనూ పీహెచ్‌డీ చేయొచ్చని తెలిపారు. రూ.5 వేల డీడీ, సంబంధిత సర్టిఫికెట్లు జత చేసి దరఖాస్తులను సెప్టెంబర్ 4లోగా డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్, జేఎన్‌టీయూకు చేర్చాలని సూచించారు. మరిన్ని వివరాలకు jntua.ac.in వెబ్‌సైట్ సందర్శించాలన్నారు.

వరకట్న వేధింపుల కేసులో ముగ్గురికి ఏడాది జైలు



గార్లదిన్నె: మహిళను వరకట్నం కోసం వేధించిన కేసులో భర్తతో పాటు అత్తమామలకు ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.10 వేల జరిమానా విధిస్తూ అనంతపురం మొబైల్ కోర్టు జడ్జి సుజిన్ కుమార్ బుధవారం తీర్పు వెలువరించారు. ఎస్ఐ గౌస్‌మహమ్మద్ బాషా తెలిపిన మేరకు.. గార్లదిన్నె మండల పరిధిలోని మర్తాడు గ్రామానికి చెందిన షరీఫ్‌కు తాడిపత్రి మండలం ఎర్రగుంటపల్లికి చెందిన హసీనాతో వివాహం జరిగింది. ఒక కుమార్తె సంతానం. మొదట్లో హసీనాను బాగా చూసుకున్న షరీఫ్ ఆ తర్వాత వేధించడం ప్రారంభించాడు. తల్లిదండ్రులతో కలిసి కొట్టేవాడు. అదనపు కట్నం తీసుకురావాలంటూ వేధించేవాడు. 2020 సెప్టెంబర్ 18న కట్టెలతో దాడి చేసి గాయపరిచాడు. దీనిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పట్లో గార్లదిన్నె పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఆరుగురు సాక్షులను విచారించిన జడ్జి సుజిన్ కుమార్.. నేరం రుజువు కావడంతో ముగ్గురికీ ఒక సంవత్సరం జైలు శిక్ష విధించారు. ఒక్కొక్కరికి రూ. 10 వేల జరిమానా విధించారు. బాధితురాలు హసీనాకు రూ.1. 50 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని ఆదేశించారు. ప్రాసిక్యూషన్ తరఫున శ్రీనివాసులు వాదించారు.

అదనపు ఎస్పీగా రమణమూర్తి బాధ్యతల స్వీకరణ



అనంతపురం సెంట్రల్: జిల్లా అదనపు ఎస్పీగా డీవీ రమణమూర్తి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. 1989 సంవత్సరంలో పోలీసు శాఖలో ఎస్ఐగా చేరిన ఆయన వివిధ ప్రాంతాల్లో పనిచేశారు. అప్పా, కర్నూలు స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా విధులు నిర్వర్తించారు. అనంతరం పదోన్నతిపై పీటీసీ అదనపు ఎస్పీగా నియమితులయ్యారు. తాజాగా సాధారణ బదిలీల్లో భాగంగా అదనపు ఎస్పీ (అడ్మిన్)గా వచ్చారు.



బెళుగుప్ప మండలం హనకనహాల్ పెద్ద వంకలో వరద ఉధృతికి ఒరిగిపోయిన టిప్పర్



కణేకల్లు సమీపంలో పరవళ్లు తొక్కుతున్న వేదావతి హగరి నది



రాయదుర్గం సమీపంలో నీట మునిగిన పొలంలో దిగాలుగా రైతు

వానో వాన..

- జిల్లా అంతటా భారీ వర్షం
- ఒకే రోజు 39.2 మి.మీ నగటు వర్షపాతం
- పొంగి ప్రవహిస్తున్న వంకలు, వాగులు
- మరో రెండు రోజులు జిల్లాకు వర్షసూచన

అనంతపురం అగ్రికల్చర్: వరుణుడి హోరు కొనసాగుతోంది. జిల్లాలో వర్షాలు ఆగడం లేదు.మంగళ వారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు 31 మండలాల పరిధిలో ఏకంగా 39.2 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. బెళుగుప్ప 89.8 మి.మీ, రాయదుర్గం 85.4, వజ్రకరూరు 82.6, కళ్యాణదుర్గం 80.2, కూడేరు 78.4, పెద్దవడుగూరు 65.2, ఉరవకొండ 62.4, గుత్తి 60.8, పామిడి 53.8 మి.మీ వర్షం కురిసింది. కంబదూరు 45.6 మి.మీ, గుమ్మఘట్ట 42.6, విడపనకల్లు 42.4, గుంతకల్లు 40.4, శింగనమల 39.6, శెట్టూరు 37.4, బొమ్మనహాళ్ 31.4 మి.మీ వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లోనూ మోస్తరు వర్షాలు కురిశాయి. ఆగస్టు నెల సాధారణం 83.8 మి.మీ కాగా ఇప్పటికే 266 శాతం అధికంగా 194.6 మి.మీ వర్షపాతం నమోదైంది. రాగల రెండు రోజులూ జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు.

రూ.4.41 కోట్ల పంట నష్టం

భారీ వర్షాలకు రూ.4.41 కోట్ల పంటనష్టం వాటిల్లినట్లు వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు తెలిపారు. 25 మండలాల పరిధిలో 804 హెక్టార్లలో వ్యవసాయ పంటలు దెబ్బతినడంతో రూ. 2.21 కోట్లు, 123 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతినడంతో రూ.2.16 కోట్ల నష్టం వాటిల్లిందన్నారు.

చెరువులకు గండి

కళ్యాణదుర్గం రూరల్/గుత్తి రూరల్: వర్షాలకు జిల్లాలో పలు చోట్ల చెరువులకు గండ్లు పడ్డాయి. కళ్యాణదుర్గం మండలంలోని ముద్దినాయన పల్లి చెరువు, గుత్తి మండలంలోని జక్కలచెరువు చెరువుకు గండి పడింది. దీంతో నీరంతా వృథాగా పోతోంది. చెరువు గండ్లు పూడ్చేందుకు మైనర్ ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టారు.

ఉధృతంగా పెన్నానది

శింగనమల: భారీ వర్షాలకు శింగనమల మండలంలో పెన్నా నది ఉధృతంగా పారుతోంది. తరిమెల-చిట్టూరు మార్గంలో బ్రిడ్జిపై నీరు పారుతుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పెద్దవడుగూరు మండలంలోని చిట్టూరు, గోపరాజుపల్లి, చిత్రచేడు గ్రామాలు, శింగనమల మండలంలోని తరిమెల, నిదనవాడ, రాచేపల్లికి రాకపోకలు నిలిచిపోయాయి.

బీటీపీకి భారీగా వరదనీరు

గుమ్మఘట్ట: రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజక వర్గాలకు వరప్రదాయనిగా ఉన్న బైరవాని తిప్ప ప్రాజెక్టుకు వరదనీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం 1,647 అడుగులకు నీరు చేరినట్లు జలవనరుల శాఖ ఏఈ హరీష్ తెలిపారు. 18,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందన్నారు.



అనంతపురంలో కురుస్తున్న జోరు వర్షం



అనంతపురం రజక నగర్‌లో ఇళ్ల మధ్య చేరిన వరద నీరు

ముంచెత్తిన వరద

అనంతపురంలో కురిసిన వర్షాలకు రజక నగర్, సోమనాథ్‌నగర్, బాలాజీ నగర్, యువజన కాలనీ, రంగస్వామినగర్, వడ్డే వారి కాలనీల్లోకి భారీగా వరదనీరు వచ్చి చేరింది. వంక పోరంబోకు స్థలం తనదంటూ రంగా అనే వ్యక్తి నడిమివంకకు అడ్డు వేయడంతో ఆయా ప్రాంతాలకు వరద పోటెత్తింది. మేయర్ వసీం ముంపు ప్రాంతాల్లో పర్యటించి బాధితులతో మాట్లాడారు. మోకాళ్ల లోతు నీటిలోనే నడుచుకుంటూ వెళ్లి జేసీబీల సాయంతో వంకకు అడ్డుగా వేసిన వ్యర్థాలను తొలగించేలా చర్యలు తీసుకున్నారు. సర్వే చేసి శాశ్వత చర్యలు చేపడతామని స్థానికులకు హామీ ఇచ్చారు.



కళ్యాణదుర్గం మండలం ముద్దినాయన పల్లి చెరువుకు గండి పడటంతో వృథాగా పోతున్న నీరు



శింగనమల మండలం తరిమెల-చిట్టూరు గ్రామాల మధ్య పెన్నానది ఉధృతి

దూసుకొచ్చిన మృత్యువు

- కారును ఢీకొన్న లారీ
- ముగ్గురి దుర్మరణం

తాడిపత్రి రూరల్: ఎంతో ఆనందంగా ఉన్న సమయంలో చిన్నపాటి గొడవ జరగడంతో వారు అర్ధంతరంగా వెనుదిరగాల్సి వచ్చింది. ఊహించని ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. తాడిపత్రి మండలం వంగనూరు గ్రామ సమీపంలో బుధవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. వివరాలు.. యల్లనూరు మండలం గొడ్డుమర్రికి చెందిన ప్రతాప్ రెడ్డి (24), ప్రమీల (20) దంపతులు. ఇంకా సంతానం కలగలేదు. ప్రతాప్ రెడ్డి కారు డ్రైవర్ కాగా, పట్టణంలోని ఓ వస్త్ర దుకాణంలో ప్రమీల పనిచేసేది. ప్రేమ వివాహం చేసుకున్న వీరు తాడిపత్రి మండలంలోని గద్దరగుట్టపల్లిలో కాపురముండేవారు. మంగళవారం వైఎస్సార్ జిల్లా పులివెందుల సమీపంలోని వేంపల్లిలో ప్రమీల సోదరుడి కుమారుడు కేశఖండన కార్యక్రమానికి భార్య, ఆమె తల్లి వెంకటలక్ష్మితో కలిసి ప్రతాప్ రెడ్డి కారులో వెళ్లాడు. వేంపల్లి వద్ద కారు రివర్స్ చేస్తున్న సమయంలో ఓ వ్యక్తికి బురద చిట్లడంతో ప్రతాప్‌రెడ్డితో గొడవకు దిగాడు. వివాదం మరింత ఎక్కువవుతుందన్న భయంతో బంధువులంతా ప్రతాప్‌రెడ్డితో పాటు భార్య ప్రమీల, అత్త వెంకటలక్ష్మిని బలవంతంగా కారులో పంపించేశారు. ఈ క్రమంలో మరో అర గంటలో గద్దరగుట్టపల్లికి చేరుతారన్న సమయంలో వంగనూరు సమీపంలో వీరు ప్రయాణిస్తున్న కారును ఎదురుగా లారీ ఢీకొంది. ప్రమాదంలో ప్రతాప్ రెడ్డి, భార్య ప్రమీల ఘటనాస్థలిలోనే ప్రాణాలు విడిచారు. వెంకటలక్ష్మిని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో కన్నుమూశారు. కారులో ఇరుక్కుపోయిన ప్రతాప్‌రెడ్డి, ప్రమీల మృతదేహాలను స్థానికుల సాయంతో పోలీసులు బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేశారు.



లారీ ఢీ కొనడంతో కారులోనే ఇరుక్కుపోయిన భార్యాభర్తలు



మృతి చెందిన ప్రతాప్‌రెడ్డి, ప్రమీల, వెంకటలక్ష్మి (ఫైల్)

ఎస్సీ, ఎస్టీల సమస్యలు పరిష్కరించాలి

- అధికారులకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం
- ప్రత్యేక గ్రీవెన్స్‌లో 262 వినతులు

అనంతపురం అర్బన్: ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజల సమస్యలను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి కలెక్టర్‌తో పాటు అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డీఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, డిప్యూటీ కలెక్టర్ జె.శిరీష, జెడ్పీ సీఈఓ ఓబుళమ్మ, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 262 వినతులు అందాయి.

వినతుల్లో కొన్ని...

- తమ భూమిని ఆన్‌లైన్‌లో చేర్చి పట్టాదారు పాసుపుస్తకం ఇవ్వాలని ఐదు సంవత్సరాలుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని కూడేరు మండలం పి.నాగిరెడ్డిపల్లికి చెందిన ఎం.ప్రమీల ఫిర్యాదు చేశారు. సర్వే నెంబరు 788/3,788/2లో తమకు భూమిని ఉందన్నారు. ఇప్పటికైనా న్యాయం చేయాలని కోరారు.
- తమ భూమిని తమ పేరున నమోదు చేయించాలని ఎం.నారాయణస్వామి విన్నవించారు. రాప్తాడు మండలం హంపాపురం గ్రామ పొలం సర్వే నంబరు 376-1బిలో 4.86 ఎకరాలు ఉందన్నారు. ఇందుకు సంబంధించి వివాదం విషయంలో రెవెన్యూ అధికారుల ఉత్తర్వులు, న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పులను పరిశీలించి తన పేరున నమోదు చేయించాలని విజ్ఞప్తి చేశారు.
- జిల్లాలో ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ పకడ్బందీగా అమలు చేయాలని ఆల్‌ఇండియా ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం నాయకులు విన్నవించారు. సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్, ఉపాధ్యక్షుడు నారాయణ స్వామి, కేంద్ర కార్యవర్గ సభ్యులు సోమశేఖర్, డాక్టర్ సైదన్న, శ్యాంబాబు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నిధులను ఎస్సీఎస్టీ వర్గాల అభ్యున్నతికి మాత్రమే ఖర్చు చేయాలని కోరారు. తాజా జనాభా లెక్కల మేరకు నిధుల కేటాయింపులు జరపాలన్నారు.



గ్రీవెన్స్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్‌తో వాగ్వాదం చేస్తున్న ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు

ఒకే అధికారికి నాలుగు బాధ్యతలా?

'డీఎల్‌డీఓ ఓబుళమ్మకు నాలుగు శాఖల బాధ్యతలు ఇవ్వడమేంటి? ఇంక ఎవరూ మీకు కనిపించలేదా? ఎస్సీ, ఎస్టీ అధికారులు పనికి రారా? ఇంకా ఏమైనా ఖాళీలు ఉంటే ఆ బాధ్యతలనూ ఆమెకే కట్టబెట్టండి. మా వర్గాల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చే బాధ్యత ఎస్సీ, ఎస్టీల సంఘాల ప్రతినిధులుగా మాపై ఉంది. బాధితులు మాత్రమే రావాలి అని చెబుతూ మా సంఘాలను కించపరుస్తారా?' అంటూ ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు నెరమెట్ల ఎల్లన్న, చిన్నపెద్దన్న, కేపీనారాయణ స్వామి, అక్కులప్ప, తదితరులు ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక గ్రీవెన్స్‌లో కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌తో వాగ్వాదానికి దిగారు. 'అనంతపురం డీఎల్‌డీఓగా ఓబుళమ్మకు గుంతకల్లు డివిజన్ డీఎల్‌డీఓ బాధ్యతలు ఇచ్చారు, డీఆర్‌డీఏ పీడీ బాధ్యతలు అప్పగించారు, అంతటితో ఆగకుండా జెడ్పీ సీఈఓ బాధ్యతలూ కట్టబెట్టారు. జిల్లాలో అంత కంటే గొప్ప అధికారి ఎవరూ మీకు కనిపించలేదా? ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించేందుకు ఎస్సీ, ఎస్టీ అధికారులే లేరా? మీ దృష్టిలో వారు పనికిరాని వారా' అంటూ నిలదీశారు. ఈ క్రమంలో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. డీఎస్పీ ప్రతాప్, సీఐ ప్రసాద్‌రెడ్డి అక్కడికి చేరుకుని నాయకులను బయటికి తీసుకెళ్లడంతో సమస్య సద్దుమణిగింది.

టమాట రైతులకు న్యాయం చేయాలి

- మాజీ ఎంపీ అనంత వెంకటరామిరెడ్డి



అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం స్పందించి జిల్లాలోని టమాట రైతులకు న్యాయం చేయాలని మాజీ ఎంపీ అనంత వెంకటరామిరెడ్డి విజ్ఞప్తి చేశారు. అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి టమాట మండీలో ఇటీవల జరుగుతున్న పరిణామాలపై ఆయన తీవ్రంగా స్పందించారు. జిల్లాలో టమాట రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను మార్కెట్‌కు తీసుకొచ్చాక కొనకపోతే వారి పరిస్థితి ఏమి కావాలని ప్రశ్నించారు. ఒక రైతుగా ఆ బాధ ఎలా ఉంటుందో తనకు తెలుసన్నారు. మండీలో బయ్యర్లు, మండీ ఓనర్లు, లారీ యజమానులు గ్రూపులుగా విడిపోయి కమీషన్ల కోసం ఆరాట పడుతున్నారు తప్ప రైతులకు జరుగుతున్న నష్టాలు పట్టడం లేదన్నారు. అసోసియేషన్ల పేరుతో మండీని హస్తగతం చేసుకుని రైతులను పీడిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్ రాజశేఖర రెడ్డి సీఎం అయిన తర్వాత డ్రిప్, స్ప్రింక్లర్లు ఇచ్చి రైతులను ప్రోత్సహించారని, దీంతో జిల్లాలో వాణిజ్య పంటల సాగు విపరీతంగా పెరిగిందన్నారు. కళ్యాణదుర్గం, శింగనమల, రాప్తాడు నియోజకవర్గాల్లో రైతులు టమాట పంట ఎక్కువగా సాగు చేస్తున్నారన్నారు. రైతులను పీక్కు తినేందుకు మండీలో ఆధిపత్య పోరు సాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసోసియేషన్ల నాయకులను కట్టడి చేసి రైతుకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. మండీ యాజమాన్యాలు, లారీ అసోసియేషన్, బయ్యర్ల ప్రమేయం తగ్గించి రేయింబవళ్లు కష్టపడి పంటలు పండించిన రైతులకు న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ మార్కెటింగ్ కమిషనర్ స్పందించి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేదంటే రైతుల పక్షాన పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

అందరి సహకారంతో ప్రజలకు సేవలు



బయోడేటా

పేరు	: శివ నారాయణ శర్మ
స్వస్థలం	: రాయ పట్టణం, మధుర జిల్లా
విద్య	: కంప్యూటర్ ఇంజినీరింగ్
తొలి ఉద్యోగం	: సాఫ్ట్‌వేర్ డెవలపర్
ఐఏఎస్	: 2017 బ్యాచ్
ర్యాంక్	: 278
తొలి పోస్టింగ్	: సబ్ కలెక్టర్, ఆదోని

అనంతపురం అర్బన్: అందరి సహకారంతో ప్రజలకు సత్వర సేవలు అందిస్తానని జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ తెలిపారు. బుధవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందించే సేవల్లో నాణ్యత చాలా ముఖ్యమన్నారు. అలాంటి సేవలు అందినప్పుడే ప్రభుత్వం, అధికారులు, ఉద్యోగులపై ప్రజలకు నమ్మకం పెరుగుతుందన్నారు. అంతకుముందు కలెక్టర్ వి.వినోద్ కుమార్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో జేసీ శివ నారాయణ శర్మ మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. నూతన జేసీని సర్వే శాఖ ఏడీ రూప్లానాయక్, కలెక్టరేట్ ఏఓ మారుతి, రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కుళ్లాయప్ప, దివాకర్, డిప్యూటీ తహసీల్దారు చాంద్‌బాషా, షేక్షావలి, సంజీవ రాయుడు తదితరులు కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.



ఊగే ఊగే ఉయ్యాల

'ఊగే ఊగే ఉయ్యాల రాగం తియ్యాల.. కొండాకోనా గుండెల్లో వూగే ఉయ్యాల' అన్నట్టుందిగా ఈ చిత్రం! పెన్నహోబిలం క్షేత్రంలో వానరాలు ఇలా కరెంటు సర్వీస్ వైరునే ఊయలగా చేసుకుని ఊగుతూ చూపరులను ఆకట్టుకున్నాయి. –సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

క్లుప్తంగా

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


మృతుడు రవి

శెట్టూరు: పంటల సాగుకు చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... శెట్టూరు మండలం లింగదీర్లపల్లికి చెందిన రైతు కురుబ రవి (48)కి భార్య రేణుకమ్మ, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. తనకున్న 4.50 ఎకరాల భూమిలో పంటల సాగుకు ప్రైవేట్ వ్యక్తుల వద్ద రూ.6 లక్షలు అప్పు చేసి బోర్లు వేయించాడు. అరకొరగా పడిన నీటితోనే వేరుశనగ, టమాట తదితర పంటలు సాగు చేపట్టాడు. అయితే పంటకు గిట్టుబాటు ధర లేక నష్టాలు చవిచూస్తూ వచ్చాడు. ఈ క్రమంలో వడ్డీల భారం పెరిగి అప్పులు తీర్చడం తలకు మించిన భారమైంది. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న రవి... బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పోలీసుల పటిష్ట బందోబస్తు


ఆర్టీసీ డిపో వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

అనంతపురం సెంట్రల్: భారత్‌బంద్ దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా బుధవారం పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ జగదీష్ ఆదేశాలతో బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్‌లు, రద్దీ ప్రాంతాలు, కూడళ్లలో ప్రత్యేక పోలీసు బలగాలను మోహరింపజేశారు.

గేదెలను నమ్మి... గెలుపు పొంది

- పాడి పరిశ్రమలో రాణిస్తున్న ఇంజినీర్
- హరియాణ, విజయవాడ నుంచి మేలుజాతి గేదెల కొనుగోలు
- రోజుకు 130 లీటర్ల పాల విక్రయం
- ఖర్చులన్నీ పోనూ నెలకు రూ.లక్షకు పైగా ఆదాయం

బీటెక్ పూర్తి చేశాడు. ఓ ప్రముఖ కంపెనీలో సాంకేతిక నిపుణుడిగా పనిలో చేరాడు. అయితే ఒకరి కింద పని చేయడం కంటే సొంతంగా ఏదైనా చిన్నపాటి పరిశ్రమ పెట్టుకుని మరో పది మందికి ఉపాధి కల్పిస్తే బాగుంటుందని భావించాడు. అది కూడా తన స్వగ్రామంలో అయితే మరీ బాగుంటుందని అనుకున్నాడు. అయితే మారుమూల పల్లెలో తానేమి చేయగలడు? అసలు ఏముందని పల్లెను ఎంచుకుని నగరం వీడేందుకు సిద్ధమయ్యాడు? ప్రస్తుతం ఉద్యోగ అవకాశాలు విస్తృతంగా ఉన్న ఇంజినీరింగ్ వృత్తిని కాదని పాడి రైతుగా మారిన సంతోకుమార్ విజయ ప్రస్థానంపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

పెద్దపప్పూరు: చదివిన చదువుకు... చేస్తున్న పనికి పొంతన లేకపోతే జీవితంలో రాణించడం చాలా కష్టమని అందరూ అంటుంటారు. అయితే ఇందుకు విరుద్ధంగా తన వద్ద సమాధానం ఉందని నిరూపించడమే కాదు... తాను అనుకున్నది సాధించి... మరో ఐదు కుటుంబాలకు ఉపాధి కల్పించాడు మెకానికల్ ఇంజినీర్ సంతోకుమార్. అందివచ్చిన ఉద్యోగ అవకాశాలను కాదని తనకు తానుగా నెలకొల్పిన పాడి పరిశ్రమలో అనూహ్య విజయాలను సొంతం చేసుకున్నాడు.

మారు మూల పల్లె నుంచి...

పెద్దపప్పూరు మండలంలోని మారుమూల గ్రామం చింతర్లపల్లికి చెందిన రామానుజాచార్యులు కుమారుడు సంతోష్‌కుమార్ రెండేళ్ల క్రితం మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. ఈ క్రమంలోనే ఉద్యోగం కోసం అన్వేషణ చేపట్టాడు. అప్పటికే అన్నమయ్య జిల్లా మదనపల్లిలోని ఓ ప్రముఖ పాల డెయిరీ మేనేజర్‌గా పనిచేస్తున్న తన తండ్రి వద్దకు అప్పుడప్పుడు వెళ్లి వచ్చే సంతోష్‌కుమార్... ఓ రోజు తన తండ్రి ఇచ్చిన ఆఫర్‌ను కాదనలేకపోయాడు. వెంటనే అదే డెయిరీలో టెక్నికల్ సూపర్‌వైజర్‌గా పనిలో చేరాడు.


సంతోష్‌కుమార్ పోషిస్తున్న గేదెలు

సొంత పరిశ్రమపై దృష్టి

పాల డెయిరీలో ఓ వైపు టెక్నికల్ సూపర్‌వైజర్‌గానే పనిచేస్తూనే మరోవైపు సొంతంగా పాడి పరిశ్రమ ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందనే ఆలోచన సంతోష్‌కుమార్‌లో మొదలైంది. ఈ క్రమంలో డెయిరీకి పాలు పోస్తున్న రైతులను క్షేత్రస్థాయిలో కలుస్తూ అందులోని సాదకబాధకాలను అడిగి తెలుసుకున్నాడు. పాడి పశువుల పోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంచుకున్నాడు. అనంతరం తన తండ్రి ప్రోత్సాహంతో స్వగ్రామానికి చేరుకుని రూ.35 లక్షల వ్యయంతో 15 సెంట్ల విస్తీర్ణంలో ఓ షెడ్డు ఏర్పాటు చేసి, నీటి వసరులు, పశుగ్రాస పెంపకం చేపట్టాడు. రూ.25లక్షలు వెచ్చించి హరియాణ, విజయవాడ ప్రాంతాల నుంచి 22 మేలు జాతి గేదెలను కొనుగోలు చేసి తీసుకువచ్చి పోషణ చేపట్టాడు. 3 ఎకరాల విస్తీర్ణంలో స్వీట్ సూడాన్ రకం పశుగ్రాసాన్ని పెంచుతున్నాడు. దీంతో పాటు క్వింటా రూ.600లు చొప్పున మార్కెట్‌లో దాణా కొనుగోలు చేసి ఒక్కో పశువుకు సగటున రోజుకు 6 కిలోల చొప్పున దాణా వేస్తున్నాడు. ప్రస్తుతం ఆయన వద్ద 33 ముర్రా జాతి గేదెలు ఉండగా... వీటిలో 11 గేదెలు చూడి కట్టి ఉన్నాయి. ఒక్కో గేదె ఉదయం, సాయంత్రం రెండు పూటలా కలిపి రోజుకు 14 నుంచి 18 లీటర్ల వరకూ పాలు ఇస్తున్నాయి.

రోజూ ఆదాయమే..



నా వద్ద ఉన్న పాడి గేదెల్లో ప్రస్తుతం 11 మాత్రమే రోజుకు 130 లీటర్ల పాలను ఇస్తున్నాయి. ఈ పాలను తాడిపత్రికి తరలించి లీటర్ రూ.60 నుంచి రూ.75 వరకు విక్రయిస్తున్నా. దీంతో రోజూ ఆదాయం ఉంటోంది. గేదెల బాగోగులు చూసుకునేందుకు నాతో పాటు బిహార్‌కు చెందిన ఇద్దరిని నియమించుకున్నా. వీరికి ఒక్కొక్కరికి నెలకు రూ.15 వేల చొప్పున వేతనం ఇస్తున్నా. అలాగే పాలను సరఫరా చేసే వారికి లీటర్‌కు రూ.9 చొప్పున కమీషన్ రూపంలో చెల్లిస్తున్నా. రోజుకు 130 లీటర్ల పాల దిగుబడి రాగా పెట్టుబడులు పోనూ రూ.3,500 నుంచి రూ.4,200 చొప్పున నెలకు రూ.లక్షకు పైగా ఆదాయం సమకూరుతోంది. ఓ ఇంజినీర్‌గా ఇతరుల వద్ద పనిచేసినా ఇంతకంటే ఎక్కువ జీతం నాకు రాదు. సొంతంగా పాడి పరిశ్రమ ఏర్పాటు చేయడం ద్వారా ఐదు కుటుంబాలకు జీవనోపాధి కల్పించాను. కుటుంబసభ్యుల బాగోగులను దగ్గరుండి చూసుకునే అవకాశం దక్కింది. ఇది ఎంతో సంతృప్తిగా ఉంది.

– సంతోష్‌కుమార్, మెకానికల్ ఇంజినీర్, చింతర్లపల్లి

ఆటో బోల్తా... కూలీ మృతి


మృతుడు నరసింహులు

గుత్తి రూరల్: ఆటో బోల్తాపడిన ఘటనలో ఓ కూలీ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... నంద్యాల జిల్లా ప్యాపిలిలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన తమ్మన్నగారి నరసింహులు (37)కు భార్య కీర్తి, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. అనంతపురంలోని టమాట మండీలో కూలి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన ఏడుగురు కూలీలతో కలసి బుధవారం ఉదయం ఆటోలో అనంతపురానికి బయలుదేరాడు. గుత్తి మండలం కొత్తపేట శివారులోకి చేరుకోగానే బైపాస్ బ్రిడ్జిపై డ్రైవర్ వేగాన్ని నియంత్రించుకోలేక పోవడంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనలో నరసింహులు అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఘటనపై ఎస్‌ఐ నబీరసూల్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

టీడీపీ వర్గీయులపై కేసుల నమోదు

తాడిపత్రి అర్బన్: స్థానిక వైఎస్సార్‌సీపీ నేత కందిగోపుల మురళీప్రసాదరెడ్డి ఇంటిపై మంగళవారం జరిగిన దాడికి సంబంధించి టీడీపీ నాయకులపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. కందిగోపుల ఫిర్యాదు మేరకు.... టీడీపీకి చెందిన సోమశేఖర నాయుడు, ముచ్చుకోట సుదర్శన్, ముచ్చుకోట లోకనాథరెడ్డి, కౌన్సిలర్ మల్లికార్జున, వెన్నపూసపల్లి మల్లికార్జునరెడ్డితో పాటు మరో వంద మందిపై వివిధ సెక్షన్ల కేసు నమోదు చేసినట్లు వివరించారు. అలాగే వైఎస్సార్‌సీపీ కార్యకర్త గండికోట రఫి అలియాస్ అడ్డుపై మంగళవారం జరిగిన దాడికి సంబంధించి టీడీపీకి చెందిన ముచ్చుకోట సుదర్శన్, చిక్కేపల్లి ఖాదర్, రఘుతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జెడ్పీలో బదిలీలకు రంగం సిద్ధం

- 286 మందితో జాబితా

అనంతపురం సిటీ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఉద్యోగుల బదిలీలకు సంబంధించి నిషేధాన్ని సడలించింది. ఈ నెల 31లోగా అన్ని రకాల బదిలీలు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ క్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ పరిధిలో మొత్తం 286 మంది బదిలీలకు అర్హులుగా జెడ్పీ అధికారులు ప్రకటించారు. ఎంపీడీఓలు– 06, పరిపాలనాధికారులు–15, సీనియర్ సహాయకులు–26, జూనియర్ సహాయకులు–44, టైపిస్టులు–18, రికార్డు అసిస్టెంట్లు– 70, ల్యాబ్ అసిస్టెంట్లు–20, ఆఫీస్ సబార్డినేట్లు–84, నైట్ వాచ్‌మెన్లు– 03 మొత్తం 286 మందితో జాబితా సిద్ధం చేశారు.



వీరంతా ఐదేళ్లు అంతకంటే ఎక్కువ రోజులు ఒకే చోట పని చేసిన వారు కావడం విశేషం.

ఆరుగురు ఎంపీడీఓలకు అనివార్యం

ఉమ్మడి జిల్లాలో ఆరుగురు ఎంపీడీఓలకు ఈసారి బదిలీ తప్పనిసరి అయింది. వీరిలో బుక్కరాయసముద్రం–తేజోత్స్న, నార్పల– పి.దివాకర్, విడపనకల్లు–ఏవీ శ్రీనివాసులు, పెద్దవడగూరు–పి.కుళ్లాయిస్వామి, నల్లచెరువు–బి.శకుంతల, పెనుకొండ–ఎస్.శివశంకరప్పకు స్థానచలనం కలగనుంది. అయితే పెనుకొండ ఎంపీడీఓ ఉద్యోగ విరమణకు మరో ఆర్నెల్లు మాత్రమే గడువు ఉండడంతో ఆయన బదిలీ కాకపోవచ్చని జెడ్పీ వర్గాలు అంటున్నాయి.

జెడ్పీ చైర్‌పర్సన్‌కు సీనియారిటీ జాబితా

బదిలీ ఉద్యోగుల జాబితాను జెడ్పీ అధికారులుచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అనుమతి కోసం పంపారు. మరోవైపు బదిలీల ప్రక్రియకు పది రోజులే గడువు ఉండడంతో ఉద్యోగులు జెడ్పీ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. బదిలీల దరఖాస్తులు సమర్పించేందుకు వచ్చే వారితో కార్యాలయ పరిసరాలు సందడిగా మారాయి. మరికొందరు ఉద్యోగులు తాము కోరుకున్న చోటుకు బదిలీ కోసం ప్రజాప్రతినిధుల ఇళ్లు, కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. సిఫార్సుల కోసం పడిగాపులు కాస్తున్నారు. ఇప్పటికే కొందరు ప్రజాప్రతినిధుల లెటర్లు సంపాదించినట్లు తెలిసింది. ఇదే క్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధుల బంధువులమంటూ కొందరు, సన్నిహితులమని ఇంకొందరు బ్రోకర్ల అవతారమెత్తారు. ప్రజాప్రతినిధుల సిఫార్సు లెటర్లను తాము ఇప్పిస్తామని చెబుతూ బేరాలు మొదలుపెట్టినట్లు ఉద్యోగుల్లో చర్చ నడుస్తోంది.

పరిహారం చెల్లించాల్సిన బాధ్యత బీమా సంస్థదే

- స్పష్టం చేసిన వినియోగదారుల కమిషన్
- మరణించిన కానిస్టేబుల్ కుటుంబానికి రూ. 30 లక్షలు చెల్లించాలని తీర్పు

అనంతపురం సెంట్రల్: ఒప్పందం మేరకు చెల్లించాల్సిన బీమా పరిహారం మొత్తాన్ని మృతి చెందిన కానిస్టేబుల్ కిష్టప్ప కుటుంబసభ్యులకు చెల్లించాలని జిల్లా వినియోగదారుల కమిషన్ చైర్‌పర్సన్ ఎం. శ్రీలత మంగళవారం తీర్పు చెప్పారు. వివరాలు.. కానిస్టేబుల్ కిష్టప్ప 1998లో ఉద్యోగంలో చేరాడు. రాష్ట్ర పోలీసు స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్సు ఉద్యోగుల జీతాలను యాక్సిస్ బ్యాంకు చెల్లిస్తోంది. నిబంధనల ప్రకారం జీరో బ్యాలెన్స్ అకౌంట్ ఉన్న వారు ప్రమాదవశాత్తు మరణిస్తే సదరు ఉద్యోగి కుటుంబానికి యాక్సిస్ బ్యాంకు ద్వారా న్యూ ఇండియా అస్సూరెన్స్ కంపెనీ రూ. 30 లక్షలు చెల్లించేలా ఒప్పందం ఉంది. ఈ నేపథ్యంలో 2020 ఫిబ్రవరి 10న కానిస్టేబుల్ కిష్టప్ప ద్విచక్ర వాహనంపై అనంతపురం వస్తుండగా పంపనూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. మెరుగైన చికిత్స నిమిత్తం బెంగుళూరుకు తరలిస్తుండగా మృతి చెందారు. ఈ క్రమంలోనే ఉద్యోగుల రక్షణ కోసం ఏర్పాటు చేసిన బీమా మొత్తాన్ని చెల్లించాలని బ్యాంకును కిష్టప్ప భార్య కావడి సుమిత్ర, కుమార్తె మంజుశ్రీ, కుమారుడు మనోజ్‌కుమార్ దరఖాస్తు చేసుకోగా.. బ్యాంకు సిబ్బంది తిరస్కరించారు. అంబుడ్స్‌మెన్‌ను ఆశ్రయించినా ఫలితం రాలేదు. దీంతో వారు జిల్లా వినియోగదారుల న్యాయస్థానాన్ని ఆశ్రయించగా.. బుధవారం విచారణ చేపట్టారు. వైద్యుల సిఫార్సు లేకుండా బెంగుళూరుకు తరలించడంతోనే కిష్టప్ప మరణించారంటూ బీమా సంస్థ తరఫున హాజరైన న్యాయవాది చేసిన వాదనను న్యాయస్థానం తోసిపుచ్చింది. పరిహారం రూ. 30 లక్షలు, 2021 జనవరి నుంచి వడ్డీ రూ. 20 వేలు, లీగల్ ఖర్చులు రూ. 5 వేలు మొత్తం 40 రోజుల్లో చెల్లించాలని జిల్లా వినియోగదారుల న్యాయస్థానం చైర్‌పర్సన్ ఎం. శ్రీలత, సభ్యులు డి గ్రేస్ మేరీ, బి గోపినాథ్‌తో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది.

పెళ్లి కాకుండానే ప్రసవం

గుమ్మఘట్ట: యువకుడిని నమ్మి మోసపోయిన ఓ యువతి పెళ్లి కాకుండానే ఆడబిడ్డకు జన్మనిచ్చింది. వివరాలు... గుమ్మఘట్ట మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని గలగలపైదొడ్డి గ్రామానికి చెందిన ఈశ్వరప్ప కుమారుడు నగేష్ ప్రేమ పేరుతో నమ్మించాడు. ఏడాదిగా ఆమెను తన చుట్టూ తిప్పుకున్నాడు. పెళ్లి చేసుకుంటానని మాయమాటలతో శారీరకంగా లొంగదీసుకున్నాడు. ఈ క్రమంలో ఆమె గర్భం దాల్చింది. విషయం ఇంట్లో తెలియడంతో ఆమెను తల్లిదండ్రులు నిలదీశారు. నగేష్ విషయం ఇంట్లో వాళ్లకు తెలిపింది. పెళ్లి చేసుకుందామని ప్రాధేయపడగా అతను కాలయాపన చేస్తూ వచ్చాడు. సోమవారం రాత్రి పురిటి నొప్పులు రావడంతో కుటుంబసభ్యులు వెంటనే ఆమెను రాయదుర్గంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. మంగళవారం ఉదయం ఆమె ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారు. అయితే పెళ్లి కాకుండానే తల్లిని చేసిన నగేష్ మాత్రం ఆమెను వివాహం చేసుకునేందుకు మొరాయిస్తున్నట్లు సమాచారం. రెండు రోజులుగా అజ్ఞాతంలోకి వెళ్లాడు. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజినమ్మ ఆస్పత్రికి చేరుకుని బాధితురాలితో వివరాలు ఆరా తీశారు. ఇద్దరు మేజర్లు కావడంతో విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కాగా, ఈ ఘటనపై ఇప్పటి వరకూ తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని స్టేషన్ హౌస్ ఆఫీసర్ రఘు తెలిపారు.

అనధికారిక లేఅవుట్లలో ప్లాట్లు కొనొద్దు

అనంతపురం కార్పొరేషన్: నగర పాలక సంస్థ పరిధిలోని 23 అనధికారిక లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేయొద్దని అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ) మారుతి హరిప్రసాద్ ప్రజలకు సూచించారు. ఇటువంటి లేఅవుట్లలో భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయబోమని స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సర్వే నంబర్ 564560, 291-1, 292-1, 446, 116/3, 58/2బీ, 159/2 -159/3, 159/2-15/3, 445, 78-1, 106/1ఏ, 106/1ఏ3, 71-1, 89-1, 218/1, 53/9ఏ, 53/6, 53/2, 318, 452, 167/4, 192/5, 191/5, 83లోని లేఅవుట్లు అక్రమంగా వెలిసినట్లు గుర్తించామని పేర్కొన్నారు. వీటిలో ప్లాట్ల అమ్మకం, కొనుగోలుకు సంబంధించి రిజిస్ట్రేషన్లు కూడా చేయబోరని తెలిపారు.

మామను హతమార్చిన అల్లుడు

రాప్తాడు రూరల్: కూతురినిచ్చిన మామనే అల్లుడు హతమార్చిన ఘటన కలకలం రేపింది. అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... కక్కలపల్లికి చెందిన సర్దార్‌వలి (55) బేల్దారి పనులతో జీవనం సాగించేవాడు. తనకున్న ఒక్కగానొక్క కుమార్తెను అనంతపురం నగరానికి చెందిన వెల్డర్ సాదిక్‌వలికి ఇచ్చి వివాహం జరిపించాడు. కొంత కాలంగా సాదిక్‌వలి దంపతుల మధ్య మనస్పర్థలు చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలో అల్లుడు వెల్డింగ్ పని చేస్తున్న ప్రతి ప్రాంతానికి మామా వెళ్లి ఆయన గురించి చెడుగా చెప్పేవాడు. దీంతో మామపై కక్ష పెంచుకున్న సాదిక్‌వలి ఎలాగైనా ఆయనను హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం కక్కలపల్లిలోని మామ ఇంటికి చేరుకుని కత్తితో దాడి చేశాడు. తర్వాత పక్కనే ఉన్న రాయితో తలపై మోది హతమార్చి అక్కడి నుంచి ఉడాయించాడు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అనంతపురం డీఎస్పీ బదిలీ

అనంతపురం సెంట్రల్: అనంతపురం డీఎస్పీ టీవీవీ ప్రతాప్‌కుమార్ బదిలీ అయ్యారు. ఆయన్ను ఏసీబీ డీఎస్పీగా బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. అలాగే వెయిటింగ్‌లో ఉన్న డీఎస్పీ జి.ప్రసాద్‌రెడ్డిని 14వ బెటాలియన్‌కు, కదిరి డీఎస్పీ శ్రీలతను తిరుపతి మహిళా పీఎస్‌కు బదిలీ చేశారు.


గుప్తనిధి వేటగాళ్ల అరెస్ట్

రాయదుర్గం: గుప్తనిధి వెలికి తీసేందుకు ప్రయత్నించిన ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు తెలిపారు. బుధవారం రాయదుర్గం అర్బన్ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ వలీబాషాతో కలసి నిందితుల వివరాలను ఆయన వెల్లడించారు. రెండు రోజుల క్రితం బళ్లారి రోడ్డులోని కుంటుమారెమ్మ ఆలయం వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టిన సమయంలో రాయదుర్గం నుంచి బళ్లారి వైపు వెళుతున్న కేఏ 50పీ 7097 నంబరు గల వాహనాన్ని ఆపి పరిశీలించారు. ఆ సమయంలో ముగ్గురు పారిపోయారు. ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వాహనంలో వంట గ్యాస్, ఆక్సిజన్ సిలిండర్లు, గ్యాస్ కట్టర్లు, గడ్డ పారలు, సుత్తులు, ఉలి, పూజా సామగ్రి, ఆత్మరక్షణ కోసం మారణాయుధాలు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం స్థానిక వైఎస్సార్ సర్కిల్ వద్ద మరో ఇద్దరు పట్టుబడ్డారు. వీరిలో శింగనమల మండలం నాగులగుడ్డంకు చెందిన గంజికుంట విజయ్‌కుమార్, పెద్దవడుగూరు మండలం మిడుతూరుకు చెందిన బోయ వెంకటేశులు, చల్లా శివకుమార్, రాయదుర్గం పట్టణానికి చెందిన కంసల నబీఖాన్, షేక్ వన్నూర్‌వలి ఉన్నారు. డి.హీరేహాళ్ మండలం అశోక సిద్దాపురం సమీపంలో కొండల్లో వెలసిన పురాతన ఆలయంలో గుప్తనిధి వెలికి తీసేందుకు వెళుతున్నట్లుగా విచారణలో నిందితులు అంగీకరించారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.


నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

చిరు వ్యాపారి కిడ్నాప్

బుక్కరాయసముద్రం: ఓ చిరువ్యాపారిని కిడ్నాప్ చేసిన ఉదంతం నగరంలో కలకలం రేపింది. వివరాలు... అనంతపురంలోని తపోవనం ప్రాంతానికి చెందిన కుళ్లాయప్ప... ఊరూర తిరుగుతూ గృహోపకరణాల విక్రయంతో జీవనం సాగిస్తున్నాడు. నగరానికి చెందిన కొందరితో ఆయనకు తగాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం నలుగురు వ్యక్తులు మాస్కులు ధరించి ఏపీ39ఎస్‌టీ 0641 నంబర్ గల కారులో కుళ్లాయప్పను బలవంతంగా ఎక్కించుకుని వెళ్లారు. బీకేఎస్, నార్పల కేశేపల్లి, నాయనపల్లి క్రాస్, రెడ్డిపల్లి, జంతలూరు గ్రామాల్లో తిరుగుతూ కారులోనే పిడిగుద్దులు కొడుతూ వచ్చారు. ఈ క్రమంలో జంతలూరు సమీపంలోకి చేరుకోగానే దెబ్బలు తాళలేక డ్రైవర్ వెనుక నుంచి మెడను కుళ్లాయప్ప గట్టిగా బిగించాడు. దీంతో డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. విషయాన్ని గుర్తించిన స్థానికులు అక్కడకు చేరుకుంటుండా నలుగురు వ్యక్తులు పారిపోయారు. స్థానికుల సాయంతో బయటపడిన కుళ్లాయప్ప... జరిగిన విషయాన్ని తెలపడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. బాధితుడిని ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, కిడ్నాపర్ల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


వ్యాపారిని కిడ్నాప్ చేసిన కారు ఇదే

తాడిపత్రిలోనే ఎస్పీ మకాం

తాడిపత్రి అర్బన్: పట్టణంలో అల్లర్ల నేపథ్యంలో ఎస్పీ జగదీష్ తాడిపత్రిలోనే మకాం వేశారు. రెండు రోజుల క్రితం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రికి రావడాన్ని జీర్ణించుకోలేని పచ్చ మూకలు విధ్వంసానికి తెరలేపాయి. ఈ క్రమంలో అదే రోజు పట్టణానికి చేరుకుని జరిగిన విషయాలపై ఆరా తీసిన ఎస్పీ.. రాత్రి అక్కడే ఉండిపోయారు. బుధవారం శాంతిభద్రతలను సమీక్షించారు. ఇద్దరు డీఎస్పీలు, ఇద్దరు సీఐలు, ముగ్గురు ఎస్‌ఐలతో పాటు 170 మంది ఏఆర్, ఏపీఎస్పీ, సివిల్ పోలీసులతో ప్రధాన కూడళ్లలో బందోబస్తును ఏర్పాటు చేయించారు. ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి నివాసాలు, వైఎస్సార్ సీపీ నాయకుడు కందిగోపుల మురళీప్రసాద్‌రెడ్డి ఇంటి వద్ద పోలీసు బలగాలను మోహరించారు.

27న జాబ్ మేళా

అనంతపురం కార్పొరేషన్: స్థానిక కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) జేకేసీ ఆధ్వర్యంలో ఈ నెల 27న బీపీఓ ఉద్యోగాలకు జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శంకరయ్య బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 20 కంపెనీల ప్రతినిధులతో జాబ్‌మేళా ఉంటుంది. ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులు. ఆసక్తి ఉన్న నిరుద్యోగులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు 10 బయోడేటా ఫారాలు, రెండు సెట్ల జిరాక్స్ కాపీలు, 5 ఫొటోలు వెంట తీసుకురావాలి. ఎంపికైన వారికి నెలకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకూ వేతనం చెల్లిస్తారు. పూర్తి వివరాలకు 81063 99029, 87901 72463, 77806 09936లో సంప్రదించవచ్చు.

మట్టి గణపతులకే ప్రాధాన్యతనివ్వండి

- ఇన్‌చార్జి జేసీ రామకృష్ణారెడ్డి


మాట్లాడుతున్న ఇన్‌చార్జి జేసీ రామకృష్ణారెడ్డి

అనంతపురం అర్బన్: వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరూ మట్టి గణపతినే పూజించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వినాయక చవితి విశిష్టతను కాపాడేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. పర్యావరణానికి హాని కలిగించని సహజ రంగులతో చేసిన మట్టి ప్రతిమలతో పండుగ జరుపుకునేలా ప్రతి ఒక్కరూ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ అంశంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. మట్టి ప్రతిమలు అందించే వారిని ప్రోత్సహించాలని సూచించారు. సమావేశంలో ఆర్‌డీఓలు వసంత బాబు, రాణీసుస్మిత, శ్రీనివాసులురెడ్డి, పర్యావరణ ఇంజనీర్ కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.

22ఏ భూముల్ని పునఃపరిశీలించండి

అనంతపురం అర్బన్: జిల్లాలో 22ఏ (నిషేధిత భూములు) జాబితా నుంచి ఫ్రీహోల్డ్ అయిన భూములపై రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ సమన్వయంతో పునః పరిశీలన చేపట్టాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఓ 596 ప్రకారం జిల్లాలో 108.309 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ జరిగిందన్నారు. 22ఏ జాబితా నుంచి ఫ్రీహోల్డ్ అయిన భూమిని యజమానులే రిజిస్ట్రేషన్ చేసుకున్నారా లేదా అనేది పరిశీలించాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్, ఆర్‌డీఓలు శ్రీనివాసులురెడ్డి, రాణీసుస్మిత, మునిసిపల్ ఆర్‌డీ పీవీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

- జిల్లాలో చెరువులు నింపేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. మైనర్ ఇరిగేషన్ పరిధిలోని 301 చెరువులకు సంబంధించి మ్యాప్ సిద్ధం చేయాలని చెప్పారు. హగరి నది నుంచి నీరు వృథాగా వెళ్లకుండా మధ్యమధ్యలో చెక్ డ్యామ్‌లు నిర్మించే అంశాన్ని పరిశీలించాలని చెప్పారు. సమావేశంలో ఎస్ఈలు రాజశేఖర్, దేశేనాయక్, విశ్వనాథ్‌రెడ్డి, ఎస్‌డీసీ శిరీష, ఈఈలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అకడమిక్ క్యాలెండర్ ఆవిష్కరణ



అకడమిక్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: జిల్లా సాధారణ పరీక్ష మండలి అకడమిక్ క్యాలెండర్‌ను బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి బి.వరలక్ష్మి ఆవిష్కరించారు. 232 పాఠశాల దినాల్లో పరీక్షల తేదీలు, సెలవు దినాలను తెలియజేస్తూ క్యాలెండర్‌ను తయారు చేసినట్లు డీఈఓ తెలిపారు. కార్యక్రమంలో పరీక్షల విభాగం ఏసీ గోవింద్ నాయక్, ఏడీ కృష్ణయ్య, డీసీఈబీ కార్యదర్శి పురుషోత్తంబాబు, కార్యాలయ పర్యవేక్షకులు ఆదినారాయణ, సరళకుమారి తదితరులు పాల్గొన్నారు.

రోస్టర్ పాటించకపోతే ఆందోళనలు

అనంతపురం సెంట్రల్: శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయంలో అకడమిక్ కన్సల్టెంట్ ఉద్యోగ నియామకాల్లో రోస్టర్ పాటించకపోతే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఎస్కేయూ వీసీ అనితను కలిసి వినతిపత్రం అందజేశారు. తెలుగు డిపార్ట్‌మెంట్‌లో ఏడేళ్లుగా పనిచేస్తున్న దళిత సామాజిక వర్గానికి చెందిన కన్సల్టెంట్‌కు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పలు విభాగాల్లో చాలా మంది ఎస్సీ అభ్యర్థులకు అన్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు మోతిలాల్ నాయక్, రామకృష్ణ, ఈశ్వరయ్య, కాటమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్కేయూలో బంద్



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

అనంతపురం సెంట్రల్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన భారత్ బంద్‌లో భాగంగా బుధవారం ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఎస్కే యూనివర్సిటీలో ర్యాలీ నిర్వహించారు. బంద్‌కు సహకరించాలని వీసీ అనితకు విజ్ఞప్తి చేశారు. క్యాంపస్ కళాశాలలను బంద్ చేయించారు. కార్యక్రమంలో ఎస్కేయూ కమిటీ నాయకులు సుబ్బరాయుడు, చంద్రశేఖర్, సునీల్, నాగేంద్ర, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి దసరా ఉత్సవాలు

అనంతపురం కల్చరల్: నగరంలోని మొదటిరోడ్డులో ఉన్న శ్రీకాశీవిశ్వేశ్వరాలయంలో సెప్టెంబరు 3 నుంచి 12 వరకు దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈవో సాకే రమేష్‌బాబు, అనువంశిక ధర్మకర్త హోసూరు రామసుబ్రమణ్యం తెలిపారు. ఈ మేరకు బుధవారం ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సారి దసరా వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. పది రోజుల పాటు అమ్మవారికి వివిధ వాహన సేవలు, అలంకారాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

హంద్రీనీవా కాలువలోకి వర్షపు నీరు



హంద్రీ నీవా కాలువలో ప్రవహిస్తున్న వర్షపు నీరు

ఆత్మకూరు: మూడు, నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో వర్షపు నీరంతా హంద్రీనీవా కాలువలో చేరుతోంది. ఇప్పటికే మండల పరిధిలోని చెరువులు, కుంటలు నిండటంతో ఆ నీరు కూడా మండల పరిధిలోని పంపనూరు సమీపంలో ఉన్న హంద్రీనీవా కాలువలోకి వచ్చి చేరుతోంది. ప్రస్తుతం కాలువలో దాదాపు రెండు అడుగుల లోతున వర్షపు నీరు ప్రవహిస్తోంది.

పండమేరు పరిసరాల్లోకి వెళ్లకండి

రాప్తాడు: భారీ వర్షాలతో పండమేరు వంకలోకి భారీగా నీరు చేరుతోందని, అందువల్ల పండమేరు పరిసరాల్లోకి ఎవరూ వెళ్లవద్దని రాప్తాడు సీఐ తోట వెంకట శ్రీహర్ష సూచించారు. ముఖ్యంగా చిన్నారులు పండమేరు వైపు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బుధవారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. భారీ వర్షాలతో మండలంలోని వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయన్నారు. రామగిరి, కనగానపల్లి మండలాల్లో భారీ వర్షాలు కురవడంతో పండమేర వంక నాలుగు అడుగుల ప్రవహిస్తోందన్నారు. వంకలో గుంతలున్నాయని పొరపాటున పిల్లలు అటువైపు వెళ్తే జరిగే నష్టం ఊహించలేమన్నారు. అలాగే చెక్ డ్యాంలన్నీ పొంగి ప్రవహిస్తున్న నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు.

- గత టీడీపీ హయాంలో నడిమివంక రక్షణ గోడల నిధుల మళ్లింపు
- వైఎస్సార్ సీపీ పాలనలో పూడికతీత పనులు
- వరదలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం
- ఈ ఏడాది జూలైలో షో చేసిన ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్



వంక స్థలాన్ని కబ్జా చేసిన రంగాపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మేయర్ వసీం



రజక నగర్‌ను ముంచెత్తిన వరద నీరు

వరద కష్టం.. టీడీపీదే పాపం!

అనంతపురం కార్పొరేషన్: గతంలో టీడీపీ ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయం కారణంగా నగర ప్రజలకు వరద కష్టాలు తప్పడం లేదు. జోరు వర్షం వచ్చిందంటే చాలు ముంపు ప్రాంతాల ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి కురిసిన వర్షాలకు వరదనీరు ముంచెత్తడంతో బతుకు జీవుడా అంటూ స్థానికులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

నిధులు మళ్లించి.. కష్టం తెచ్చిపెట్టి..

రక్షణ గోడలకు (ప్రొటెక్షన్ వాల్)కు మంజూరైన నిధులను గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి చెరువుకట్ట అభివృద్ధి పేరుతో మళ్లించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కోవిడ్‌తో రెండున్నరేళ్లు గడిచిపోయినా.. అకాల వర్షాలు వచ్చినప్పుడు అప్పటి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ముందస్తు చర్యల్లో భాగంగా వంకలో ఎటువంటి అడ్డు లేకుండా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ షో చేయడం తప్పితే శాశ్వత పరిష్కారం దిశగా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వంకకు అడ్డుతోనే కాలనీల్లోకి వరద..

కళ్యాణదుర్గం బైపాస్ నుంచి వడ్డేవారికాలనీ వరకు నడిమివంక పొడవు 2.6 కిలోమీటర్లు ఉంది. నడిమి వంకకు ఆనుకుని 5వ రోడ్డు, యువజన కాలనీ, రంగస్వామినగర్, సోమనాథ్‌నగర్, బాలాజీ నగర్, వడ్డే వారి కాలనీ ప్రాంతాలున్నాయి. ఈ ప్రాంతాల్లో 10 వేలకు పైగా నివాసాలుంటాయి. వడ్డే వారికాలనీలో రంగా అనే వ్యక్తి తనకు చెందిన స్థలం అంటూ అధికార పార్టీ అండతో వంకకు అడ్డుగా భవన నిర్మాణ వ్యర్థాలను వేస్తున్నాడు. దీంతో వర్షం వచ్చినప్పుడల్లా నడిమి వంక సమీప ప్రాంతాల ఇళ్లలోకి నీరు వస్తోంది. మంగళవారం రాత్రి కురిసిన వర్షాలకు నడిమివంక సమీప కాలనీల్లోకి భారీగా నీరు చేరింది.

రక్షణ గోడేదీ...?

గతంలో నడిమివంక ముంపు సమస్యకు పరిష్కారం చూపడంలో భాగంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో రూ.58 కోట్ల నిధులు మంజూరు కాగా, అందులో రజక నగర్‌లో రక్షణ గోడల ఏర్పాటుకు రూ.18 కోట్లు ఉన్నాయి. ఆ నిధులను గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో అప్పటి ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి ట్యాంక్ బండ్‌కు మళ్లించారు. అప్పటి నుంచి రజక నగర్‌కు రక్షణ గోడలను ఏర్పాటు చేయలేదు.

అనంత చొరవ..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కోవిడ్‌తో రెండున్నరేళ్ల పాటు గడిచిపోయాయి. 2022లో భీకర వర్షాలు రావడంతో ముంపు ప్రాంతాలను భారీగా వరద నీరు చుట్టుముట్టింది. అప్పట్లో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అందుకు గల కారణాలపై ఆరా తీసి, వడ్డేవారి కాలనీ సమీపంలో నడిమివంకకు వేసి అడ్డును దగ్గరుండి తొలగించారు. టవర్‌క్లాక్ బ్రిడ్జి పనులు జరిగే సమయంలో పెద్ద ఇటాచీలు, జేసీబీలను తెప్పించి పోలీసుల సమక్షంలో వంకకు అడ్డు తొలగింపజేశారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో ప్రభుత్వానికి నిధులను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. అయితే, ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడం, అందరూ దానిపై దృష్టి సారించడంతో రంగ అనే వ్యక్తి మరోమారు గుట్టుచప్పుడు కాకుండా వంకలో నిర్మాణ వ్యర్థాలను అడ్డుగా వేశారు. దీంతో మళ్లీ సమస్య మొదటికొచ్చింది.



వర్షపు నీటిలో స్థానికుల అవస్థలు

ఎమ్మెల్యే దగ్గుపాటి మభ్యపెట్టే యత్నం..

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన అనతి కాలంలోనే స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్‌తో కలసి నడిమివంకను పరిశీలించారు. పూడికతీత పనులు చేపట్టాలని, వర్షం వచ్చినా ప్రజలు ఇబ్బందులు పడకూడదని చెప్పి ప్రజలను నమ్మించే యత్నం చేశారు. పలుమార్లు ఎమ్మెల్యే, అధికారులు ఆయా ప్రాంతాల్లో పర్యటించి, వంకకు అడ్డుగా ఉన్న వ్యర్థాలను తొలగిస్తామని చెప్పి మాటతప్పారు.

సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇలాగే భారీ వర్షాలు కురిస్తే ఇళ్లలోకి నీరు వచ్చింది. అప్పట్లోనూ వంకకు అడ్డు వేశారు. అప్పటి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి స్పందించి అడ్డు తొలగించారు. ఇప్పుడు ప్రభుత్వం మారింది. సమస్య మొదటికొచ్చింది. అధికారులు రావడం, వెళ్లడంతోనే సరిపోతోంది. ఇప్పటికైనా సర్వే చేసి శాశ్వత పరిష్కారం చూపాలి.

– రఘు, బాధితుడు

వర్షం వచ్చినప్పుడల్లా అవస్థలే



మా ఇంట్లో నేను, నా కుమార్తె ఉంటాం. కూలిపని చేసుకుని జీవనం సాగిస్తున్నాం. వర్షం వచ్చిందంటే చాలు ఇళ్లలోకి భారీగా వర్షం నీరు వస్తోంది. అలా వచ్చినప్పుడుల్లా ఇంట్లోని నిత్యావసర సరుకులు పాడైపోతాయి. రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు నష్టం సంభవిస్తుంది. మాలాంటి పేద వాళ్లను ఎవరూ పట్టించుకుంటారు. దయచేసి ఇలాంటి ఇబ్బంది లేకుండా చూడాలి.

– మంగమ్మ, వడ్డే వారి కాలనీ

ఆక్రమణలపై విచారణ జరపాలి



రజకనగర్, వడ్డే వారి కాలనీ ప్రజలను గత కొన్నేళ్లుగా వరద సమస్య పట్టిపీడిస్తోంది. వర్షం వస్తే ప్రజలు తీవ్ర అవస్థలు పడాల్సిందే. వంక స్థలం తనదని రంగా అనే వ్యక్తి తరచూ అడ్డు వేస్తున్నాడు. ఎక్కడైనా వంక పొరంబోకు పట్టా ఇవ్వాలంటే రెండెకరాల వరకు ఇవ్వచ్చు. కానీ ఏడు నుంచి ఎనిమిదెకరాలు ఏ విధంగా కేటాయిస్తారు. జిల్లా కలెక్టర్ దీనిపై సమగ్ర విచారణ జరిపించాలి.

– శ్రీనివాసులు, 48వ డివిజన్ కార్పొరేటర్

రక్షణ గోడల ఏర్పాటుకు చర్యలు



ముంపు ప్రాంతాలకు వరద నీరు పోటెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపుతాం. గతంలోనూ వంకకు అడ్డు వేస్తే అప్పటి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, పాలకవర్గం చర్యలు తీసుకుంది. నడిమి వంకకు రక్షణ గోడల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. వంకకు ఆనుకుని నిర్మించిన ఇళ్లకు నోటీసులు జారీ చేశాం. సమగ్రంగా సర్వే చేసి శాశ్వత ప్రాతిపదికన కాలువ ఉండేలా చర్యలు తీసుకుంటాం.

– వసీం, మేయర్



మోకాలు లోతు నిలిచిన నీటిలోనే పరిశీలనకు వెళ్తున్న మేయర్ వసీం



నడిమివంకలో వేసిన వ్యర్థాలు తొలగిస్తున్న జేసీబీకి అడ్డుపడుతున్న రంగా



రక్షణ గోడకు ఆనుకుని ప్రమాదకరంగా ప్రవహిస్తున్న నడిమివంక



వరద నీటిలో ఇబ్బందులు పడుతూనే పాఠశాలకు సైకిల్‌పై వెళ్తున్న విద్యార్థిని

సమ్మె కొనసాగిస్తాం : ఆప్ జూడా

అనంతపురం మెడికల్: వైద్యులకు భద్రత కల్పించేలా కేంద్రం నుంచి స్పష్టత వచ్చే వరకూ సమ్మెను కొనసాగిస్తామని ఆప్ జూడా అధ్యక్షుడు హరికిరణ్ స్పష్టం చేశారు. కోల్‌కతాలో పీజీ వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచారానికి నిరసనగా కొన్ని రోజులుగా పీజీ వైద్య విద్యార్థులు, హౌస్‌సర్జన్లు సమ్మెలోకి వెళ్లిన విషయం విదితమే. సమ్మెలో భాగంగా బుధవారం నగరంలో భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వ వైద్య కళాశాల నుంచి కోర్టు రోడ్డు, క్లాక్‌టవర్, సప్తగిరి సర్కిల్, సంగమేష్‌నగర్, కలెక్టరేట్, విద్యుత్‌నగర్ మీదుగా తిరిగి కళాశాలకు చేరుకున్నారు. దాదాపు 300 మంది ర్యాలీలో పాల్గొన్నారు. అంతకు ముందు బుధవారం ఉదయం ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఆవరణలో ఆప్ జూడాలు చేపట్టిన నిరసన కార్యక్రమానికి సీఐటీయూ ఓబులు, సీపీఐ జాఫర్, ఏఐడీఎస్‌ఓ, హంస సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో పీజీ విద్యార్థులు స్వప్న, ఆరీఫ్, సాయి, లీలా, శ్రావణి, ప్రత్యూష, హర్ష, నవ్య, హౌస్‌సర్జన్లు సాక్షి, శిల్ప, తదితరులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీలో పాల్గొన్న జూనియర్ డాక్టర్లు

సీఐటీయూ కొవ్వొత్తుల ర్యాలీ: కోల్‌కతాలో పీజీ వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. జెడ్పీ నుంచి ప్రభుత్వ సర్వజనాస్పత్రి వరకూ ర్యాలీ సాగింది. వైద్య సిబ్బందికి రక్షణ కల్పించలేని ప్రభుత్వాల తీరు సిగ్గుచేటని, దేశ వ్యాప్తంగా వైద్య సిబ్బంది రక్షణకు సమగ్ర చట్టం తీసుకురావాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర డిమాండ్ చేశారు.

ఎస్సీ వర్గీకరణ చేస్తే పోరుబాట తప్పదు

- మాల మహానాడు ఐక్యవేదిక అధ్యక్షుడు కోట్ల గంగాధర్ హెచ్చరిక

అనంతపురం టవర్‌క్లాక్: ఎస్సీ వర్గీకరణ అంశం రద్దు చేయకపోతే పోరుబాట తప్పదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను మాల మహానాడు ఐక్యవేదిక అధ్యక్షుడు కోట్ల గంగాధర్ హెచ్చరించారు. వేదిక ఆధ్వర్యంలో బుధవారం అనంతపురంలో చేపట్టిన భారత్ బంద్ విజయవంతమైంది. నగర శివారులోని 44వ జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. గంగాధర్ మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏకపక్షంగా వ్యవహరిస్తూ ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని చూడడం సరైంది కాదన్నారు. 46 లక్షల జనాభా ఉన్న మాలలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోబోమన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సీఎం చంద్రబాబు కుట్రపూరిత రాజకీయాలకు తెరలేపారనే విషయాన్ని మాలలు గుర్తించాలన్నారు. రాబోవు రోజుల్లో ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీవీఎంసీ సభ్యుడు రామన్న, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కేవీ చలపతి, న్యాయవాది రంగనాయకులు, సమతా సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షుడు సుగమంచి శ్రీనివాసులు, ఉరుము కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు పూలకుంట రాము, నాయకులు బాబు, శివలింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.



44వ జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న మాలమహానాడు నాయకులు

తాడిపత్రి ఘటనలకు సీఎం బాధ్యత వహించాలి

అనంతపురం టవర్‌క్లాక్: తాడిపత్రిలో జరిగిన అవాంఛనీయ ఘటనలకు సీఎం చంద్రబాబు పూర్తిగా బాధ్యత వహించాల్సి ఉందని రాజ్యాంగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పోతుల నాగరాజు అన్నారు. బుధవారం అనంతపురంలోని సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని ఆందోళన వ్యక్తం చేశారు. తాడిపత్రిలో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యేని పట్టణంలోకి రాకూడదంటూ కట్టడి చేయడం చూస్తే పరిస్థితి ఎంతగా దిగజారిందో అర్థం చేసుకోవచ్చునన్నారు. తాడిపత్రి రాజకీయాలు ప్రజల కోసం కాదని కేవలం ఓ వర్గానికి చెందిన వారి స్వార్థం కోసమే నన్నది స్పష్టమవుతోందన్నారు. తాడిపత్రి చుట్టుపక్కల ఉన్న సహజ వనరులు, భారీ పరిశ్రమలు, వ్యాపార కేంద్రాలపై ఆధిపత్యం కోసం ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు.



మాట్లాడుతున్న నాగరాజు

నయన మనోహరం.. మధ్యారాధనం

అనంతపురం కల్చరల్: మంత్రాలయ రాఘవేంద్ర స్వామి 253వ ఆరాధన మహోత్సవాలలో భాగంగా మధ్యారాధన వేడుకలు బుధవారం నయనమనోహరంగా సాగాయి. పాతూరులోని వ్యాసరాజ మఠంలో రాఘవేంద్రస్వామితో పాటు వివిధ దేవతామూర్తులను చందన అలంకారం, వివిధ పుష్పాలతో విశేషంగా అలంకరించి ఆరాధించారు. సూగూరు ఆలయం నుంచి విచ్చేసిన పండితులు వెంకోబరావు రాఘవేంద్ర స్వామి దివ్య చరితను వినిపించారు. అనంతరం మహా ప్రసాద వితరణ జరిగింది. వ్యాసరాజ మఠం అధికారి శ్రీకాంత్, హరి, రఘునాథాచార్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మొదటిరోడ్డు మంత్రాలయ రాఘవేంద్రస్వామి మఠం భక్తజన సంద్రంగా మారింది. మధ్యారాధన సందర్భంగా బృందావనాన్ని ఎంతో ఆకర్షణీయంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సాగిన సాంస్కృతిక సంబరాలు ఆకట్టుకున్నాయి.

- నగరంలోని నేతాజీ నగర్ రవీంద్రస్వామీజీ ఆశ్రమం సామూహిక మంత్రపుష్పం, రుద్రాభిషేక సహిత శ్రీసూక్త, దుర్గాస్తుతితో మార్మోగింది. బుధవారం మంత్రాలయ రాఘవేంద్రస్వామి ద్వితీయ ఆరాధన సందర్భంగా వేడుకలు నిర్వహించారు. రాఘవేంద్రస్వామి బృందావనానికి, వేంకటేశ్వరస్వామికి, పంచముఖ ఆంజనేయస్వామి మూలమూర్తులకు ప్రత్యేక అలంకారం చేసి ఆరాధించారు. రవీంద్రస్వామీజీ రాఘవేంద్రస్వామి ఆరాధన ఉత్సవాల విశిష్టతను భక్తులకు తెలియజేసి తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. ఆశ్రమ నిర్వాహకులు అన్నప్రసాద వసతి కల్పించారు. గురువారం ఉత్తరారాధనతో వేడుకలు ముగుస్తాయని తెలిపారు.



మొదటిరోడ్డు రాఘవేంద్రస్వామి మఠంలో పూజలందుకున్న బృందావనం

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోండి

అనంతపురం సెంట్రల్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని స్వశక్తితో జీవించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.శివప్రసాద్ యాదవ్ సెక్స్ వర్కర్లకు సూచించారు. బుధవారం నగరంలోని ఓ హోటల్లో సెక్స్ వర్కర్లకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించారు. న్యాయ సహాయం కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయించాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఆర్ సభ్యులు హరికృష్ణ, పద్మజ, వివిధ సంస్థల ప్రతినిధులు నాగమణి, ఝాన్సీ, పుష్పవతి, సంతోషి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.శివప్రసాద్‌యాదవ్

సామాజిక బాధ్యతగా మొక్కల పెంపకం

- కేంద్రీయ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య ఎస్‌ఏ కోరి

అనంతపురం సెంట్రల్: సామాజిక బాధ్యతగా తీసుకుని ప్రతి ఒక్కరూ ఒక మొక్క చొప్పున నాటి సంరక్షించాలని కేంద్రీయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య ఎస్‌ఏ కోరి పిలుపునిచ్చారు. బుధవారం యూనివర్సిటీ ప్రాంగణంలో ఎన్‌ఎస్‌ఎస్ సహకారంతో మొక్కల పెంపకానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకూ రెండు వేల మొక్కలు నాటామని, పది వేల మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. విభిన్న జాతుల పక్షులను ఆకర్షించడానికి, అంతరించిపోతున్న వృక్షజాతులను కాపాడటానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. వర్సిటీని ప్లాస్టిక్ రహిత ప్రదేశంగా మార్చాలని నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో ఎస్కే యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ మురళీధర్‌రావు, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు ప్రొఫెసర్ రాంరెడ్డి, ప్లాంటేషన్ కమిటీ చైర్మన్ కేశవరెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



మొక్క నాటి నీరు పోస్తున్న దృశ్యం

ఆటో డ్రైవర్లకు రూ.10 వేలు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ఉపప్రధాన కార్యదర్శి మల్లికార్జున

అనంతపురం అర్బన్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ఆటో డ్రైవర్లకు రూ.10 వేల చొప్పున ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీఐటీయూ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక రాణీనగర్‌లోని ఫెర్రర్ కాలనీలో ఐదుకల్లు సదాశివన్ భవన్‌లో ఆటో డ్రైవర్ల సమావేశం నిర్వహించారు. ఆటో డ్రైవర్ల సంఘం నాయకుడు సూరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మల్లికార్జునతో పాటు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు లింగమయ్య మాట్లాడారు. డ్రైవర్ల సాధికార సంస్థ ఏర్పాటు చేసి ప్రతి ఆటో డ్రైవర్‌కు రూ.10 వేలు ఇస్తామన్న హామీని అమలు చేయాలన్నారు. డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తే ఆటో డ్రైవర్లు జీవనోపాధి కోల్పోతారన్నారు. అలాగే జీవో 21 రద్దు చేస్తామన్న హామీని తక్షణం అమలు చేయాలన్నారు. అనంతరం ఆటో డ్రైవర్ల సంఘం అధ్యక్షునిగా కె.నారాయణస్వామి, ప్రధాన కార్యదర్శిగా విష్ణువర్ధన్, కోశాధికారిగా షబ్బీర్‌బాషా, ఉపాధ్యక్షునిగా హనుమంతరాయుడు, సహాయ కార్యదర్శిగా ఆదినారాయణతో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.